భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

- పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- వేడుకల్లో పాల్గొన్న గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వాసులు తమ పూర్వీకుల సమాధులను దర్శించి వాటిని శుభ్రంచేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసి స్మరించుకున్నారు. ఈస్టర్ పండుగ వేడుకల్లో పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్ఆర్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్లు మర్యాద పూర్వకంగా అతిథులకు స్వాగతం పలికారు. మండలంలోని బ్రాహ్మణ కోడూరు, చింతలపూడి, పట్టణంలోని పాత పొన్నూరు చర్చి, 12, 13 వార్డుల్లోని చర్చిల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, పార్టీ నాయకులు బొద్దులూరి రంగారావు, షేక్ నాజర్, వడ్రాణం ప్రసాదు, బొనిగల వేణుప్రసాదు, గేరా సంజీవ్, అనిలా కుమారి, కోటా శ్రీనివాసరావు, మూర్తి రాజు, అంబటి వెంకటేశ్వరరావు, నాగరాజు, కార్యకర్తలు, విశ్వాసులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

ఘనంగా ఈస్టర్ పండగ

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి, నారాకోడూరు, శలపాడు, శేకూరు, చేబ్రోలు, సుద్దపల్లి తదితర గ్రామాల్లో ఈస్టర్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు, సంఘ పెద్దలు పండుగ విశిష్టతను తెలియజేశారు.

నంబూరులో ఈస్టర్ వేడుకలు

పెదకాకాని: పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో ఏసు పవిత్ర హృదయం పుణ్యక్షేత్రం ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా చర్చి ఫాదర్ రెవరెండ్ పూదోట నవీన్ వాక్యోపదేశం చేశారు. మరణంపై ఉత్థానం గెలిచిన రోజు కావడంతో యావత్ ప్రపంచం యేసు పునరుత్థాన దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నట్లు వివరించారు. యావత్ ప్రపంచం ఏసు ప్రభువు చూపిన మార్గంలో నడవాలన్నారు. చర్చి కన్వీనర్ డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏసు ప్రభువు సూచించిన మార్గంలో మానవాళి నడుచుకొని క్రమశిక్షణ, విశ్వాసం పెంపొందించుకోవాలని కోరారు . క్రీస్తు పునరుత్థాన దినముకు గుర్తుగా బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని సంగస్తులు వ్యక్త పరిచారు. చర్చి పెద్దలు కోడూరు కనకరాజు, వల్లభాపురం హృదయరాజు, డీకన్ థామస్, మరియన్న యూత్ కోఆర్డినేటర్ పల్లపాటి సురేష్ తదితరులు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. చర్చి పెద్దలు, యూత్, దళ సభ్యులు, దీక్షాపరులు పాల్గొన్నారు.


నంబూరు చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

కాకుమాను: మండంలోని గ్రామాలలో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే తమ కుటుంబీకుల సమాధుల వద్దకు వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాలలో చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. స్థానిక ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయంలో పాస్టర్ కృపాదానం క్రీస్తు మరణం గురించి వివరించారు.


పొన్నూరు చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్న క్రైస్తవులు


వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ రెవరెండ్ పూదోట నవీన్


సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సుప్రసిద్ధ రచయిత్రి తేజోవతి కన్నుమూత



పాత గుంటూరు: సమాచార శాఖ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్, దివంగత ఏ. విఠల్ రావు సతీమణి సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ అధరాపురపు తేజోవతి (88) ఆదివారం ఉదయం గుంటూరులో కన్నుమూశారు. ఆమె అనేక నవలలు, కథలు రాశారు. పూర్వా సంధ్య ప్రవర్తతే, మృత్యోర్మ అమృతంగమయ, విద్యార్థి లాంటి 15 కు పైగా నవలలు, 250 కథలు, 100కు పైగా రేడియో కథానికలు రాశారు. నాగార్జున విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, బొమ్మిడాల జాతీయ సాహిత్య పురస్కారం ద్వారా అందిన రూ. 3 లక్షలను తను చదివిన శారదానికేతనం విద్యాలయం అభివృద్ధికి విరాళంగా అందజేశారు. వృద్ధుల ఆశ్రమాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇప్పటికీ ప్రతి నెలా అందిస్తున్నారు. అంతిమయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి ప్రారంభం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ఓటు హక్కు వినియోగంపై 'స్వీప్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు విలువైందని, సమర్థవంతమైన ప్రజా ప్రతినిధులు ఎన్నుకునే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. అంతటి పవిత్రమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని చెప్పారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కూడా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో నూరుశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. మండల తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్ర రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జీవితమే గొప్ప సందేశం

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



పట్నంబజారు: దయ, త్యాగం, కరుణ ఎంతో గొప్పవనే సందేశాన్ని తన జీవితం ద్వారా విశ్వ మానవాళికి అందించిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. సత్యంపై విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్ అని పేర్కొన్నారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ముత్యం నివాసంలో ఆదివారం జరిగిన ఈస్టర్ పర్వదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ సత్యాన్ని అంతం చేయాలని చూసిన ప్రతిసారీ అది ఏదో ఒక రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నారు. హింస, ద్వేషాలు కేవలం మరణాన్ని మాత్రమే మిగిల్చితే.. ప్రేమ, క్షమాగుణాలు జీవితత్వానికి నూతనత్వాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సత్యాన్ని నిరూపించడానికి సమాధి నుంచి సజీవుడై ఏసు ప్రభువు లేచి వచ్చారని తెలిపారు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం, విశ్వ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరికీ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. యావత్ క్రైస్తవ సమాజానికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేడుకలకు హాజరైన వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణను లేళ్ల అప్పిరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

మంగళగిరి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ వి. నిర్మల్ కుమార్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సరఫరా చేయడానికి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 7093912653 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలు పై నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే అధికారులు సమస్యను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఉచిత ఆరోగ్య శిబిరం



తెనాలిటౌన్: పట్టణంలోని బోసురోడ్డులో ఉన్న కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ చక్ర హాస్పిటల్ సౌజన్యంతో రోగులకు ఎముకలు, బీపీ, షుగర్, జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని విశ్రాంత జడ్జి గ్రంధి గోపాలకృష్ణమూర్తి ప్రారంభించారు. ఆయన వైద్య పరీక్షలు చేసుంచుకున్నారు. సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ అచ్యుత సాంబశివరావు, సభ్యులు మాలేపాటి తిరుమలరావు, బూర్లగడ్డ గోపికృష్ణ, శ్రీధర్, బెల్లంకొండ రామ్మోహన్, పోకూరి శ్రీనివాసరావు, మాదల పూర్ణ, వంకదార శివ సుధాకర్, హరిబాబు, నాగరాజారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎస్ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో యస్ఐగా బాధ్యతలు నిర్వహించిన అల్లంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్. రవికాంత్, సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ యస్ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. కేసుల విషయంలో సూచనలు, సలహాలు బాగా ఇచ్చేవారని తెలిపారు. అలాంటి సీనియర్లు పదవీ విరమణ అనంతరం కూడా ప్రజలకు సేవలతో పాటు పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టండి

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్

బండ్లవారిపాలెం(కాకుమాను): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని బండ్లవారిపాలెం, లింగంగుంటపాలెం, వల్లూరు, చినలింగాయపాలెం, కొల్లిమర్ల, పాండ్రపాడు, కేబీపాలెం, గరికపాడు, బీకేపాలెం, కొండపాటూరు, కాకుమానులోని 25 పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కావాల్సిన అన్ని వసతులను కల్పించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. మండలంలో 85 సంవత్సరాలు నిండిన ఓటర్లను గుర్తించి వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రత్యేక అవసరాలు గల వారిని వాహనాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకు రావాలని తెలిపారు. ప్రతి అధికారి ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఎస్ఐ రవీంద్ర, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, ఎంఈఓ–2 విజయ భాస్కర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రమేష్ తదితరులు ఉన్నారు.


బండ్లవారిపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో శ్రీకర్

బీసీలంటే సమాజానికి బ్యాక్ బోన్


పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: బీసీలంటే సమాజానికి బ్యాక్ బోన్ అని చాటిచెప్పిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. గుంటూరులోని 30 డివిజన్ ఆర్.అగ్రహారంలో బీసీ నేత గూడూరి నాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. జై బీసీ.. వన్స్ మోర్ వైఎస్సార్ సీపీ అనే పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.అనంతరం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కిలారి రోశయ్య చుట్టుగుంట సమీపంలోని కృపా మినిస్ట్రీస్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

బీసీలంటే సమాజానికి వెన్నుముకలు

నెహ్రూనగర్: బీసీలంటే సమాజంలో వెనుకబడిన కులాలు కాదని..సమాజానికి వెన్నుముక వర్గాలని చాటి చెప్పి వారి అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి , పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గూడూరు నాని ఆధ్వర్యంలో జై బీసీ..వన్స్ మోర్ వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఆదివారం ఏటీ అగ్రహారంలో మంత్రి రజిని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే బీసీల పార్టీ అనే వాస్తవాన్ని రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలన్నీ గుర్తించాయి అన్నారు. గ్రామ , వార్డు సభ్యుల నుంచి శాసన సభాపతి, రాజ్యసభ పదవుల వరకు అగ్రస్థానం కల్పించి బీసీల పక్షపాతిగా సీఎం వై.ఎస్. జగన్ చరిత్రలో నిలిచారని కొనియాడారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో బీసీలకు జరిగిన అవమానాలు, వేధింపులు అన్నీఇన్నీ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి బీసీకీ న్యాయం జరిగిందని ధైర్యంగా చెబుతామని, అలా చెప్పే ధైర్యం టీడీపీకి ఉందా ? అని ప్రశ్నించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పెత్తందారుల కూటమి కూలిపోవడం ఖాయమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నేతలు, బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఆంక్షలపై పునరాలోచన చేయాలి



తెనాలి: సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీ విషయంలో వలంటీర్లపై విధించిన ఆంక్షల అమలులో ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యుడు పోతావఝుల పురుషోత్తమ శర్మ విజ్ఞప్తి చేశారు. పింఛన్ల పంపిణీ, సంక్షేమ పథకాలకు దరఖాస్తులు వంటి కార్యక్రమాలు ఎప్పటి నుంచో అమలులో ఉన్నందున, పింఛన్ల పంపిణీకి ఎన్నికల నిబంధనలు వర్తింపజేయకుండా చూడాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆంక్షలతో లక్షలాదిమంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. వలంటీర్లు పింఛన్ల పంపిణీపై వచ్చిన ఫిర్యాదులు కేవలం రాజకీయ ప్రేరేపితమన్నారు. గతంలో ఎన్నికల కమిషనర్‌గా చేసిన అధికారి సభ్యుడుగా ఉన్న సంస్థ ఈ ఫిర్యాదు చేసిందన్నారు. ఆయన అధికారంలో ఉన్నపుడు తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయని గుర్తుచేశారు. అలాంటివారి ఫిర్యాదులు పరిగణనలోకి తీసుకోవద్దని కోరారు.

నేటి నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిల ఢెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్.నతానియేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్.డేవిడ్ బ్రెన్‌హాం, ధరణి కోటకు చెందిన బ్రదర్ రేనాల్డ్స్ బాబు వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు.

దాణా అందజేత

తెనాలిఅర్బన్: శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి గౌరవ అధ్యక్షుడు కాసా శ్రీను జన్మదినం పురస్కరించుకుని ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని గోశాల గోవులకు పచ్చిమేత దాణాను పంపిణీ చేశారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్డులోని సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, షేక్ మీరావలి మాట్లాడుతూ శ్రీను అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, అనేక మందికి రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మౌలాలి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిపుష్టికి ఓటు దివ్యౌషధం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య పరిపుష్టికి ఓటు దివ్యౌషధమని లెట్స్ వోట్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ప్రొఫెసర్ కె. మాలకొండయ్య పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం ఎదుట లెట్స్ వోట్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు ఓటుహక్కు వినియోగ ప్రాధాన్యతను చాటారు. టీ షర్ట్స్ ధరించి ప్లకార్డులతో వాకర్లు, పాదచారులను కలసి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడకు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవడమే దివ్య ఔషధమని తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలు, ప్రధానంగా విద్యావంతులు, వివిధ వృత్తుల్లో ఉన్న వారు వినియోగించుకోవడంలో ప్రదర్శిస్తున్న నిర్లిప్తత విచారకరమని పేర్కొన్నారు. విద్యావంతులు, రాజకీయ, సామాజిక చైతన్యం కలిగిన గుంటూరు నగరంలో గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండటం బాధాకరమని తెలిపారు. బృందావన్‌గార్డెన్స్, చంద్రమౌళీ నగర్, ఎస్వీఎన్ కాలనీ, వికాస్‌నగర్, విద్యానగర్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో అతి తక్కువ మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఓటుకు దూరంగా ఉండటం వల్ల రాజకీయ పార్టీల నుంచి సంక్షేమం, మౌలిక సౌకర్యాల గురించి ప్రశ్నించే హక్కును కోల్పోతారని అన్నారు. లెట్స్ వోట్ సంస్థ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదని ఓటు హక్కు పై ప్రజలను జాగృతి చేయటమే తమ లక్ష్యమని వివరించారు. సామాజిక కార్యకర్త డాక్టర్ కె.శ్రీవిద్య మాట్లాడుతూ అపార్ట్‌మెంట్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని మహిళలు అనేక కారణాలు చెబుతూ ఓటుహక్కును వినియోగించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తప్పనిసరిగా మహిళలు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ సభ్యులు లెట్స్ వోట్ సంస్థ చేస్తున్న సామాజిక చైతన్యానికి హర్షం వ్యక్తం చేస్తూ, రూ.ఐదు వేల ఇచ్చి ఉదారతను చాటారు. కార్యక్రమంలో లెట్స్ వోట్ సంస్థ గుంటూరు చాప్టర్ కన్వీనర్ బాలాజీ శ్రీనివాస్, కందిమళ్ల వెంకట్రావు, మహమ్మద్ రఫీ, నగేష్ కన్నా, వీర రాఘవయ్య, వీవీకే సురేష్, మొవ్వా చంద్రమౌళీ, రాజేశ్వరరావు, కేవీ భాస్కర్, సతీష్, బుల్లి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.


ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న లెట్స్ వోట్ సంస్థ ప్రతినిధులు

ఘనంగా మంజునాథ నాట్య క్షేత్రం వార్షికోత్సవం


నాట్యక్షేత్రం చిన్నారులతో అతిథులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం వేదికపై ఆదివారం శ్రీ మంజునాథ నాట్యక్షేత్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు రాజుపాలెం మనోజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథులుగా విజయ మాధవి సేవా సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు విజయ మాధవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే నృత్యంలో ప్రావీణ్యం పొందే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా నాట్య క్షేత్రం విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శరణం నరేంద్రకుమార్, జంపని కిశోర్‌బాబు, సగుటూరు వెంకటరమణ, శారద, కె. శ్రీనివాసమూర్తి, సి.ఎ.కె.వి. బ్రహ్మం, మహంకాళి శ్రీనివాసరావు, డాక్టర్ టి. పవన్‌కుమార్, డాక్టర్ ఎం. వెంకట నరేష్, డాక్టర్ డి. నాగమల్లేశ్వరి, డాక్టర్ శర్మ పాల్గొన్నారు.

నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం



తెనాలి: డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీ నగర్‌లోని పట్టణ పేదల నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శేషిరెడ్డి ఆధ్వర్యంలో అక్కడ ఆశ్రయం పొందుతున్న పేదలకు అన్నదానం చేశారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తితో ట్రస్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శేషిరెడ్డి చెప్పారు. ఇంగ్లిష్ అధ్యాపకుడు గురిందపల్లి స్టాలిన్, కళాకారుడు విజయ్ పాల్గొన్నారు.